క్లుప్తంగా

27న ఉచిత శిక్షణ తరగతులు

యాకుత్‌పురా: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని నిరుద్యోగ యువతకు డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ గ్రీన్ జాబ్స్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 27 నుంచి సోలార్ ప్యానెల్ టెక్నిషియన్‌లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నామని ఫౌండేషన్ మేనేజర్ రాఘవేందర్‌రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడు నెలల పాటు నగరంలో నిర్వహించే ఈ శిక్షణ తరగతులకు 18 నుంచి 28 ఏళ్ల లోపు వారు ఐటీఐ డిప్లొమాలో (ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రీషియన్) అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 99641 31921, 80190 50334 లలో సంప్రదించవచ్చు.

నూతన కార్యవర్గం



గోల్కొండ: ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ గ్రేటర్ హైదరాబాద్ నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం జరిగింది. టోలిచౌకి వీనస్ హైస్కూల్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐటా గ్రేటర్ నగర అధ్యక్షుడిగా మహ్మద్ మహమూద అలీ సోహెల్ అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షులుగా సయ్యద్ షాబాద్ ఖాద్రి, సయ్యద్ ఫయాజ్, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ సమీవుల్లా హుస్సేని, జాయింట్ సెక్రటరీగా మౌలానా మిన్హాజ్, కోశాధికారి ఇర్ఫాన్ అహ్మద్ ఎన్నికయ్యారు. మీడియా కార్యదర్శిగా మహ్మద్ సోహెల్, మహిళా కన్వీనర్లుగా నుస్రత్ నిస్సార్, మెహెర్ ఉన్నీసా, ఫర్వీన్ ఆయేషా ఎన్నికయ్యారు.

అభివృద్ధి పనులు వేగవంతం

గోల్కొండ: షేక్‌పేట్ డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని కార్పొరేటర్ మహ్మద్ రాషెద్ ఫరాజుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన డివిజన్ పరిధిలోని లక్ష్మణ్‌నగర్, న్యూ గుల్షన్ కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఆయా బస్తీ కమిటీ ప్రతినిధులతో మాట్లాడి వారి సమస్యల ప్రాంతాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. షేక్‌పేట్‌లో తాను డ్రైనేజీ, రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి పక్కాగా అమలు చేశానన్నారు.

వాటర్‌బోర్డులో కాంట్రాక్టర్ల బకాయిలు చెల్లించండి



వినతి పత్రం అందజేస్తున్న శ్రీనివాస్

అబిడ్స్: వాటర్‌బోర్డులో కాంట్రాక్టర్లకు పాతబకాయిలతో పాటు కొత్త బకాయిలను కూడా వెంటనే చెల్లించాలని తెలంగాణ యునైటెడ్ కాంట్రాక్ట్స్ ఫోరం సెక్రటరీ, మీడియా ఇన్‌చార్జ్ పోల్కండ శ్రీనివాస్ డిమాండ్ చేవారు. వాటర్ బోర్డు కార్యాలయంలో బోర్డు డైరెక్టర్ అజ్మీర కృష్ణకు వినతి పత్రం అందజేసి కాంట్రాక్టర్లకు న్యాయం చేయాలన్నారు. వాటర్‌బోర్డులో కొత్తగా ప్రవేశపెట్టిన ఏఎంఎస్ పనులపై ఆధారపడిన చిరు కాంట్రాక్టర్లు తీవ్ర నిరాశలో ఉన్నారన్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన ఏఎంఎస్ సిస్టాన్ని రద్దు చేసి పాత పద్ధతిలోనే కాంట్రాక్టర్లకు పనులు అప్పజెప్పితే వారు జీవనోపాధి పొందుతారన్నారు.

రంజాన్ మాసాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

శాలిబండ: రంజాన్ మాసాన్ని ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మొదటి శుక్రవారం సందర్భంగా మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో జల్సా-ఇ-యౌముల్ ఖురాన్ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముస్లింలకు రంజాన్ నెల ఎంతో పవిత్రమైనదని.. ప్రతి ముస్లిం ఉపవాస దీక్షలు పాటిస్తూ జకాత్, ఫిత్ర్ వంటి దాన ధర్మాలు చేయాలన్నారు. రంజాన్ మాసంలో ముస్లిం లందరూ ఐదుసార్లు నమాజ్ చేయడంతో పాటు తరావీ నమాజ్ కూడా చేయాలన్నారు. ఈ సభలో ఎమ్మెల్సీ రహమత్ బేగ్, కార్పొరేటర్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. శుక్రవారం ఆయన గుడిమల్కాపూర్‌లోని జనహిత కార్యాలయంలో బీజేపీ, బీజేవైఎం నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. తన తండ్రి గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దివంగత దేవర కరుణాకర్ ఆశయ సాధనకు నిరంతరం కృషి చేస్తానన్నారు. బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్, ప్రభు పూజారి, బీజేవైఎం నాయకులు అశ్విన్ మోది, పవన్ సింగ్ లోధ్ తదితరులున్నారు.

హలీం రెడీ



శాలిబండ పిస్తా హౌజ్ వద్ద..

- రంజాన్ మాసంలో హలీంకు ప్రజాదరణ
- సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా పిస్తాహౌజ్ స్పెషల్ గిఫ్ట్ ప్యాక్

చార్మినార్: రంజాన్ మాసంలో వేడి వేడి ఘుమఘుమలాడే హలీంకు ఎంతో ఆదరణ ఉంది. ఏడాదికోసారి రంజాన్ మాసంలోనే హలీం తినే వారు చాలా మంది ఉన్నారు. ఒకప్పుడు రంజాన్ మాసంలోనే హలీం అందుబాటులోకి వచ్చేది. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవు. ఏడాది పొడవునా నగరంలోని ఎక్కడో ఒక చోట హలీం దొరుకుతోంది. రంజాన్ మాసంలో ప్రత్యేకంగా తయారు చేసే హలీంను ఉపవాస దీక్షల అనంతరం ముస్లింలు ఎంతో ఇష్టంగా తింటారు. ముస్లింలే కాకుండా హిందువులు సైతం హలీంను ఇష్టపడుతారు.

హలీంకు భలే గిరాకీ..



ఇక ప్రపంచ వ్యాప్తంగా జీఐ ట్యాగ్ గుర్తింపు పొందిన పిస్తా హౌజ్ హలీంకు రంజాన్ మాసంలేనే అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష ఆదరణ ఉంది. అందుకే ఏడాది పాటుగా ఎదురు చూసే వారికి రంజాన్ మాసంలో అందుబాటులోకి వచ్చే పిస్తా హౌజ్ హలీంకు గిరాకీ ఎక్కువగా ఉంటుంది. ఈసారి పిస్తా హౌజ్ 25 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ ఉత్సవాలలో భాగంగా రూ.1150 లకే గిఫ్ట్ ప్యాక్ పేరుతో ఫ్యామిలీ ప్యాక్ హలీంను అందజేస్తున్నట్లు పిస్తా హౌజ్ మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ అబ్దుల్ మాజీద్ తెలిపారు. రూ.990లకు ఫ్యామిలీ ప్యాక్ ఉంటుందన్నారు. పెరుగుతున్న ముడిసరుకుల ధరలకు అనుగుణంగా ఈసారి రూ.260కు ప్లేట్ హలీం అందజేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

కొనసాగుతున్న వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు



చిన్న శేష వాహనంపై లంగర్‌హౌస్ వీధుల్లో ఊరేగుతున్న స్వామి వారు

లంగర్‌హౌస్: శ్రీ రామనవమిని పురస్కరించుకొని వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. చారిత్రాత్మక మత దేవాలయం త్రివేణి సంగం ఒడ్డున వెలసిన జానకీ సమేత వీర వెంకట విజయరాఘవస్వామి ఆలయంలో సీతారాముల వారికి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో గురువారం రాత్రి కలశ స్థాపన, సకల దేవతా ఆహ్వానం నిర్వహించారు. అనంతరం వేదపండితులు, భాజాభజంత్రిలు, మంగళవాయిద్యాలతో చిన్న శేషవాహనంపై కొలువుదీరిన స్వామివారిని లంగర్‌హౌస్ పురవీధుల్లో ఊరేగించారు. అర్ధరాత్రి వరకు భజన బృందంతో భజన కార్యక్రమాలను నిర్వహించి అంతకు ముందు తరలివచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

నేడు గరుడవాహన సేవ..

వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో నిర్వహించే ప్రధాన ఘట్టల్లో గరుడవాహన సేవ శనివారం రాత్రి నిర్వహించనున్నారు. ఉదయం నుంచి నిత్య హోమం, సుందరాకాండ పారాయణం నిర్వహిస్తారు. రాత్రి 7 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసునికి కల్యాణం నిర్వహించనున్నారు. కల్యాణం అనంతరం స్వామి వారిని గరుడ వాహనంపై లంగర్‌హౌస్ పురవీధుల్లో ఊరేగిస్తారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ



చాంద్రాయణగుట్ట: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని రియాసత్‌నగర్ డివిజన్‌లో శుక్రవారం కార్పొరేటర్ సలీం బేగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ హాజరయ్యారు. మత పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. కార్పొరేటర్లు ఫహద్ బిన్ అబ్దాద్, ఆజం షరీఫ్, ఎం.ఏ.రెహమాన్, షభానా హఫీజ్ పటేల్, మజ్లిస్ నాయకులు సమద్ బిన్ అబ్దాద్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ ఉపవాస దీక్షలు



మక్కా మసీదులో వజూ చేస్తున్న ముస్లింలు

చార్మినార్: రంజాన్ మాసం మొదటి రోజు ఉపవాస దీక్షలు శుక్రవారం తెల్లవారు జామున 4.55 గంటలకు (సహార్ నమాజ్) భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. రోజంతా కఠోర ఉపవాస దీక్షలు పాటించిన ముస్లింలు సాయంత్రం 6.34 గంటలకు ఉపవాస దీక్షలను విరమించి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. మక్కా మసీదులో జరిగే సామూహిక ప్రార్థనలకు హాజరవుతున్న ముస్లింలు ముందుగా మక్కా మసీదు ప్రాంగణంలోని నీటి కొలనులో వజూ నిర్వహిస్తారు. పాత నీటి కొలనుకు మరమ్మతులు చేసి రంగురంగుల విద్యుత్ దీపాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. చాలా మంది ఉపవాస దీక్షలను మక్కా మసీదులో విరమించి ఇఫ్తార్ విందులో పాల్గొంటారు. ఇందు కోసం ఇప్పటికే తగిన ఏర్పాట్లు చేయడంతో శుక్రవారం మక్కా మసీదు ప్రాంగణం పూర్తిగా ఇఫ్తార్ విందులతో కిటకిటలాడింది.

ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న హన్మంతరావు, మెట్టు సాయికుమార్

అబిడ్స్: రాహుల్‌గాంధీ సభ్యత్వాన్ని కక్ష సాధింపుతో రద్దు చేశారని ఎంజేమార్కెట్, గాంధీభవన్ రోడ్డులో ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మను మాజీ ఎంపీ వీ.హన్మంతరావు, రాష్ట్ర కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్ల ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాహుల్‌గాంధీ రాబోయే ఎన్నికల్లో విజయం సాధించి ప్రధానమంత్రి అవుతాడనే భయంతోనే ఆయన పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేశారని ఆరోపించారు. మోదీ బెదిరింపులకు కాంగ్రెస్ పార్టీ భయపడేది లేదన్నారు.

కనుల పండువగా ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాతనగర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు ఆకుల శ్రీరాములు

చార్మినార్: పాతనగర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు ఆకుల శ్రీరాములు ఆధ్వర్యంలో హనుమాన్‌నగర్‌లో ఆత్మీయ సమ్మేళనం కనుల పండువగా జరిగింది. పాతబస్తీలోని మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన మహిళలు, యువతీ-యువకులు, పలువురు అధికార అనధికార ప్రముఖులు పాల్గొని సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాతనగర మున్నూరు కాపు మహిళా మండలి చైర్మన్ మ్యాడం చంద్ర కుమారి, జీహెచ్ఎంసీ సర్కిల్-24 డిప్యూటీ కమిషనర్ పుప్పాల రవీందర్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సంఘం అధ్యక్షుడు ఆకుల శ్రీరాములును పలువురు శాలువాలతో సత్కరించి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

ఉపవాసాలు పాటించే ముస్లిం కూలీలకు సడలింపులు కల్పించాలి



సాక్షి, సిటీబ్యూరో: మండుటెండల్లో ఉపవాసాలు పాటిస్తూ కూలీ పనులు, ఇతరత్రా దినసరి వేతన కార్మికులుగా పనిచేస్తున్న వారికి పనుల్లో సడలింపు నివ్వాలని మూమెంట్ ఫర్ పీస్ అండ్ జెస్టిస్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పురానీ హవేలీలోని కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ.. ఇప్పటికే ముస్లిం ఉద్యోగులకు ప్రభుత్వం పనివేళల్లో సడలింపులు ఇచ్చిందని ఆ తరహాలోనే ప్రైవేటు సంస్థలు, యాజమాన్యాలు యోచించాలని ఆయన సూచించారు. సంపన్న ముస్లిములు విధిగా జకాత్ సొమ్మును నిరుపేదల కోసం కేటాయించాలని ఆయన కోరారు.

కార్మికులకు జీతాలు వెంటనే చెల్లించాలి



వినతి పత్రం అందజేస్తున్న రాజేంద్రకుమార్ డెగాన్

జియాగూడ: జీహెచ్ఎంసీ, పంచాయతి కార్మికులకు వెంటనే జీతాలను చెల్లించాలని బీజేపీ ఎస్సీ మోర్చా గోల్కొండ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రకుమార్ డెగాన్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం బీజేపీ ఎస్సీమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ, పంచాయతి కార్మికులకు ఆరు నెలలుగా కేసీఆర్ ప్రభుత్వం జీతాలు చెల్లించకపోవడంపై రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయంలో వినతిపత్రం ఇవ్వాలని కోరగా గోల్కొండ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రాజేందర్ డెగాన్ నేతృత్వంలో జీహెచ్ఎంసీ జోనల్ అడిషనల్ కమిషనర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దాసరి అనిల్‌కుమార్, బన్సీలాల్, శ్రీకాంత్, మహేష్, మ్యాదరి, రాజాజోహారి, శ్రీకాంత్, శ్రీమంత్, దీపక్, నందుకుమార్ పాల్గొన్నారు.

ప్రహరీ కూలి కార్మికుడి మృతి

లంగర్‌హౌస్: ప్రహరీ కూలి కార్మికుడు మృతి చెందిన ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లాకు చెందిన కామరాజు అలియాస్ కామయ్య(50), అప్పన్న కొద్ది సంవత్సరాల క్రితం నగరానికి వచ్చి అత్తాపూర్‌లో ఉంటూ జీహెచ్ఎంసీలో తాత్కాలిక కార్మికులుగా పనిచేస్తున్నారు. రంజాన్ మాస ప్రారంభాన్ని పురస్కరించుకొని ఎంఐఎం నాయకుడు మెహమూద్ పాషా ఆధ్వర్యంలో హాషంనగర్‌లోని మసీదు వద్ద రోడ్లు ఊడుస్తున్నారు. మసీదు ఎదురుగా ఓ ఇంటి నిర్మాణం ప్రారంభమవగా పునాది కోసం గుంతలు తీశారు. గుంతల్లోని మట్టి ఆ ఇంటి పాత ప్రహరీపై పేరుకుపోయింది. మట్టి బరువుకు ప్రహరీ శుక్రవారం ఉదయం 6 గంటలకు కూలింది. ఆ సమయంలో పక్కనే ఉన్న కామయ్యతో పాటు అప్పన్న, పాషాపై గోడ పడింది. తీవ్రంగా గాయపడ్డ ముగ్గురిని చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఉదయం 10 గంటలకు కామయ్య మృతి చెందాడు. పాషా కోలుకొని ఇంటికి వెళ్లగా మరో బాధితుడు అప్పన్న తీవ్రగాయాలతో ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నాడు. ప్రైవేట్ ఆస్పత్రి నిర్వాహకులచే సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఇంటి యజమాని మహమ్మద్ ఇఫ్తకార్ అలీపై కేసు నమోదు చేశారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి



బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పౌరహక్కుల సంఘం నేతలు

సుల్తాన్‌బజార్: దండకారణ్య ఆదివాసులపై జరుగుతున్న గగనతల దాడులను ఆపివేయాలని కోరుతూ ఈనెల 26న బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సభ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. 2023 జనవరి 11న ఉదయం 11 గంటలకు ప్రారంభమైన వైమానిక, డ్రోన్ హెలికాప్టర్ దాడిలో గ్రేహౌన్స్ బలగాలు, సీఆర్‌పీఎఫ్ బలగాలు పాల్గొని ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం సుక్మా జిల్లా కిష్టారం మల్కన్‌గూడ, మిట్టగూడ, బొట్టేతోంగ్, సఖిలేర్, మంద్రాడు లాడే తదితర ప్రాంతాల్లో గ్రామాలపై దాడులు చేసి కొట్టం హంగీ అనే ఆదివాసీ మహిళను హత్య చేశారని తెలిపారు. ఈ ప్రాంతాలపై నిజ నిర్ధారణ కమిటీ సందర్శించిందని తెలిపారు. ఏప్రిల్ 14, 15 తేదీలలో అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో 50 డ్రోన్‌లతో అనేక బాంబులు జారవిడిచారని తేలింది. అలాగే ఏప్రిల్ 19న 30 ప్రజా సంఘాలు, మేధావులు, హక్కుల సంఘాల నాయకులు కలిసి ఒక నివేదిక బహిర్గతం చేశారన్నారు. ఈ విషయంపై గగనతల దాడులు ఆపివేయాలని కోరుతూ ఈనెల 26న జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి నారాయణరావు పాల్గొన్నారు.

గానం దేవుడు ఇచ్చిన వరం: పోచారం శ్రీనివాస్‌రెడ్డి



అనురాధ పొడ్వాల్‌ను సన్మానిస్తున్న స్పీకర్ పోచారం, గుత్తా సుఖేందర్‌రెడ్డి

గన్‌ఫౌండ్రీ: మధుర గానం గాయకులకు దేవుడు ఇచ్చిన గొప్పవరం అని తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో శృతిలయ ఆర్ట్స్ అకాడమీ, సీల్‌వెల్ కార్పొరేషన్, తిరుమల బ్యాంక్‌ల సంయుక్త ఆధ్వర్యంలో పద్మశ్రీ పురస్కార గ్రహీత గాయని అనురాధ పొడ్వాల్‌కు ప్రైడ్ ఆఫ్ ఇండియా పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. సంగీతం మనసుకు ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తుందన్నారు. తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కళాకారులకు ప్రేక్షకుల అభినందనలే పెద్ద బలం అన్నారు. అంతకు ముందు సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పోలీస్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దామోదర్‌గుప్తా, సీల్‌వెల్ కార్పొరేషన్ ఎండీ బండారు సుబ్బారావు, తిరుమల బ్యాంక్ చైర్మన్ చంద్రశేఖర్, శృతిలయ ఆర్ట్స్ కార్యదర్శి ఆమని, కళాపత్రిక సంపాదకులు మహ్మద్ రఫీ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నగర ట్రాఫిక్ అదనపు పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు

చార్మినార్: ప్రజల కోసం ఉచితంగా చల్లటి తాగునీటి సరఫరా కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు నగర ట్రాఫిక్ అదనపు పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు అన్నారు. దక్షిణ మండలం ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో చార్మినార్ వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రంజాన్ మాసం ఉపవాస దీక్షలతో పాటు రంజాన్ మార్కెట్, చార్మినార్ సందర్శనకు వచ్చే సందర్శకుల సౌకర్యార్థం చార్మినార్ వద్ద ఈ తాగునీటి ప్లాంట్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు దక్షిణ మండలం ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర ట్రాఫిక్ డీసీపీ అశోక్‌కుమార్, నగర ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రసాద్, దక్షిణ మండలం అదనపు డీసీపీ ఆనంద్, చార్మినార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవి పాల్గొన్నారు.

జల వనరులను కాపాడండి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మేనేజర్ కుల శేఖర్, చల్లా శ్రీనివాస్‌రెడ్డి

అబిడ్స్: ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి జలవనరులను కాపాడాలని వాటర్‌బోర్డు హిందీనగర్ మేనేజర్ కులశేఖర్ పేర్కొన్నారు. అబిడ్స్ కట్టెలమండిలోని ఆంధ్ర విద్యాలయ పాఠశాలలో జనని ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరల్డ్ వాటర్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ కులశేఖర్ పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులే ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసి భూగర్భ జలాలు పెరిగే విధంగా కృషి చేయాలన్నారు. జననీ ఫౌండేషన్ డైరెక్టర్ మల్లేష్ మాట్లాడుతూ.. తాగునీరును పొదుపుగా వాడుకోవాలన్నారు. హెచ్ఎం చల్లా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు తాగునీటి వినియోగంపై తరచూ అవగాహణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాలు సునీత, కవిత తదితరులు పాల్గొన్నారు.

వీర హనుమాన్ విజయయాత్రకు అనుమతి ఇవ్వాలి



సీపీ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బజరంగ్ సేనా నాయకులు

సుల్తాన్‌బజార్: ఏప్రిల్ 6న జరిగే వీర హనుమాన్ విజయయాత్రకు అనుమతి ఇవ్వాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర బజరంగ్ సేనా ఉపాధ్యక్షుడు ఎన్ఆర్.లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌ను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ రావు మాట్లాడుతూ.. ఏప్రిల్ 6న జరిగే వీర హనుమాన్ విజయయాత్రకు ప్రజలు భారీ ఎత్తున తరలి వస్తున్నారని తెలిపారు. ఈ బైక్ ర్యాలీ గౌలిగూడ రాంమందిర్ నుంచి తాడ్బన్ ఆంజనేయస్వామి ఆలయం వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ ర్యాలీకి పోలీసుల సహకారం ఎంతో అవసరమన్నారు. ఈ విషయమై సీవీ ఆనంద్‌ను కలిసి అనుమతి కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రజని, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం వద్దు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం పనికిరాదని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన టోలిచౌకిలోని తన కార్యాలయంలో పారిశుద్ధ్య అధికారులు, మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో ప్రధాన కూడళ్ల వద్ద పండ్లు, ఇతర తినుబండారాల అమ్మకాలు బాగా జరుగుతాయన్నారు. అదే విధంగా హోటళ్ల వద్ద కూడా రాత్రిపూట సందడిగా ఉంటుందన్నారు. ఎవరికీ ఇబ్బందికలగకుండా ప్రధాన కూడళ్లు, పండ్లు అమ్మే ప్రాంతాల్లో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాలని ఆయన అన్నారు. రంజాన్ మాసం కోసం ప్రత్యేక శానిటేషన్ యూనిట్లను ఏర్పాటు చేయాలని తాను బల్దియా కమిషనర్‌ను కోరానన్నారు. నీటి కొరత ఉన్న మసీదులకు జలమండలి వారు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టోలిచౌకి డివిజన్ మజ్లిస్ నాయకుడు హారూన్ ఫరాన్, ఏరియా కమిటీ నాయకులు మీర్జా ఎక్బాల్ అహ్మద్, సయ్యద్ రఫత్ హుస్సేన్, అలీమొద్దీన్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

30న కేసరి హనుమాన్ యువ సంఘటన్ శ్రీరామ శోభాయాత్ర



బ్రోచర్ విడుదల చేసిన అధ్యక్షుడు అద్దాల కార్తిక్, సభ్యులు

జియాగూడ: శ్రీరామనవమిని పురస్కరించుకుని ఈనెల 30న కేసరి హనుమాన్ దేవాలయ ప్రాంగణం నుంచి శ్రీరామ శోభాయాత్రను నిర్వహిస్తున్నట్లు కేసరి హనుమాన్ యువ సంఘటన్ అధ్యక్షుడు అద్దాల కార్తిక్, ప్రధాన కార్యదర్శి ఆర్.రక్షిత్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం కేసరి హనుమాన్ ఆలయం ప్రాంగణంలో శ్రీరామ శోభాయాత్ర బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీరామనవమి గురువారం రోజున దేవాలయ ప్రాంగణం నుంచి భారీ ఎత్తున శోభాయాత్ర మొదలై సబ్జిమండి గంగాపరమేశ్వరీ ఆలయానికి చేరుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సహ కార్యదర్శి దయానంద్, కార్యవర్గ సభ్యులు సందీప్‌సాగర్, ట్రస్టు సభ్యులు రఘు, రాంబాబు, రాజన్ పాల్గొన్నారు.

నకిలీ మెహిందీ తయారు చేస్తున్న వ్యక్తుల అరెస్టు



నిందితులను అరెస్టు చేసిన బేగంబజార్ పోలీసులు

అబిడ్స్: నకిలీ మెహిందీ తయారు చేస్తున్న వ్యక్తులను బేగంబజార్ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద భారీ ఎత్తున మెహిందీని స్వాధీనపరచుకున్నారు. బేగంబజార్ ఎస్ఐ నరేందర్ తెలిపిన కథనం ప్రకారం.. కొద్ది రోజులుగా పీల్‌ఖానా ప్రాంతానికి చెందిన సుఖ్‌దేవ్, అతని కుమారుడు రాకేష్ కుమావత్ నకిలీ మెహిందీని తయారు చేసి ఆయాహినా కంపెనీ పేరిట విక్రయాలు చేస్తున్నారు. తండ్రీకొడుకులు నకిలీ ఆయాహినా కంపెనీ పేరుమీద తయారు చేస్తున మెహిందీని ఆ కంపెనీ యజమాని ముఖేష్‌కుమార్ తెలుసుకున్నారు. వెంటనే బేగంబజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పీల్‌ఖానాలోని బగిచా కాంప్లెక్స్‌లో నకిలీ మెహిందీ తయారు చేస్తున్న స్థావరంపై పోలీసులు దాడులు చేశారు. పెద్ద ఎత్తున ఆయాహినా పేరిట ఉన్న పెద్ద నకిలీ మెహిందీని పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్నారు. నిందితులు సుఖ్‌దేవ్, రాకేష్ కుమావత్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

అభినందనలు

సంతోష్‌నగర్: ఈనెల 10, 11, 12వ తేదీల్లో నిజామాబాద్ జిల్లా ఆర్మూరులో జరిగిన 37వ రాష్ట్ర స్థాయి క్రీడల్లో బ్రహ్మ ప్రకాశ్ డీఏవీ పాఠశాల విద్యార్థి పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారని ప్రిన్సిపాల్ వీఎస్.ప్రశాంత్ తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గౌరీ శంకర్‌రావు, డీఏవీ పాఠశాలల ఏఆర్‌ఓ వసంత ఎస్ రామన్, ప్రిన్సిపాల్ వీఎస్.ప్రశాంత్, వ్యాయామ ఉపాధ్యాయులు తగరం మల్లేష్, మిధాని ఏజీఎం హరికృష్ణ, రంగారెడ్డి జిల్లా హ్యాండ్ బాల్ సెక్రటరీ తిరుమల్ రెడ్డి తదితరులు హాజరై ఈ పోటీకు అర్హత సాధించిన విద్యార్థి ఆశీష్‌ను అభినందించారు.